



అమ్మకానికి సిద్ధంగా ఉన్న బంగినపల్లి మామిడి పండ్లు

- రుచి కోల్పోతున్న బంగినపల్లి మామిడి
- ఏటా తగ్గుతున్న తోటల సాగు విస్తీర్ణం

ఏదీ ఆ మాధుర్యం..?

నోరూరించే బంగినపల్లి

బనగానపల్లె, మే 18

మధురమైన మామిడి పండ్లకు చిరునామా బనగానపల్లె. దీని ఖ్యాతి ఇంతా అంతా కాదు. పొరుగు రాష్ట్రాలకు, దేశ, విదేశాలకు బంగినపల్లి మామిడి పండ్లు సరఫరా అవుతుంటాయి. సామాన్య ప్రజలు కూడా వేసవిలో బంగినపల్లి మామిడి పండ్ల కోసం ఎదురు చూస్తుంటారు. అంత మధురం బనగానపల్లె మామిడి పండ్లు. కాని క్రమంగా మామిడి పండ్లలో ఆనాటి మధురం దూరమవుతోంది. వర్షాలు సరిగా కురవకపోవడం తదితర కారణాలతో బంగినపల్లె రుచి తగ్గుతోంది.



బంగినపల్లికి ఆ పేరు ఎలా వచ్చిందంటే..

బనగానపల్లె నవాబు మీర్ గులాం అలీఖాన్(1905-1922)కు మామిడి పండ్లపై మక్కువ ఎక్కువ. మామిడి పండ్లలో మేలు జాతిగా పిలిచే బేనిషాన్ రకాన్ని ఎంపిక చేసుకుని బనగానపల్లె సంస్థానంలో విరివిగా నాటించారు. దీనికి బనగానపల్లె మామిడిగా పేరు వచ్చింది. కాలక్రమేణా ఇది బంగినపల్లిగా మారింది. ఇక్కడ నుంచి తెలుగు రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాలకు ఈ రకం సాగు విస్తరించింది. ఇక్కడి మామిడి పండ్లు విదేశాలకు సైతం ఎగుమతి అవుతాయి. ఒక్కో పండు రెండు కిలోల వరకు తూగుతుంది. ఏ మాత్రం పీచు లేకుండా పూర్తిగా గుజ్జు మాత్రమే ఉండటం దీని ప్రత్యేకత. నవాబుల కాలంలో మూడు వేల ఎకరాల్లో సాగైన బంగినపల్లి ప్రస్తుతం 500 ఎకరాల్లో మాత్రమే సాగవుతోంది. వీటికి ఉన్న డిమాండ్ ఆసరాగా చేసుకుని వ్యాపారులు ఇతర ప్రాంతాలనుంచి కాయలను దిగుమతి చేసుకుని బంగినపల్లి మామిడి పండ్లుగా విక్రయిస్తున్నారు.

బంగినపల్లి మామిడి మాధుర్యం తగ్గిపోతోంది. నోరూరే ఈ మధుర ఫలం అందని ద్రాక్షలా మారింది. బనగానపల్లె పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా పండించే బంగినపల్లి మామిడి పండ్లకు విపరీతమైన డిమాండ్ ఉంది. బనగానపల్లె, యాగంటిపల్లె, జోలాపురం, పసుపల, ఇల్లూరుకొత్తపేట, భానుముక్కల తదితర ప్రాంతాల్లో దాదాపు 500 ఎకరాల్లో బంగినపల్లి మామిడిని పండిస్తారు. అలాగే బేతంచెర్ల మండలంలోని ఎంబాయి, సీతారామాపురం, ఆర్.ఎస్.రంగాపురం, బైనపల్లె, గ్రామాల్లో 300 ఎకరాల్లో బంగినపల్లి మామిడి పండ్లను పండిస్తారు. బనగానపల్లె నవాబుల కాలంలో మూడు వేల ఎకరాల్లో ఈ పంటను బనగానపల్లె పరిసర ప్రాంతాల్లో పండించేవారు. అయితే పంట సరిగా రాకపోవడంతో చెట్లను కొట్టివేసి ఇతర పంటలను పండించడంతో ఏటేటా బంగినపల్లి మామిడి విస్తీర్ణం తగ్గిపోతోంది.

తగ్గిన దిగుబడి

ఈ ఏడాది బంగినపల్లె మామిడి ఈ ఏడాది దిగుబడి భారీగా తగ్గిపోయింది. గత సంవత్సరం బంగినపల్లె మామిడి పంట బాగా పండింది. ఈ ఏడాది తేనెమంచు పురుగు, నల్లిపురుగుల బెడదతో పూత పూర్తిగా దెబ్బతింది. దీంతో 20శాతం పంట కూడా రాలేదు. దీంతో కౌలుకు తీసుకున్న పంటలను పూర్తిగా వదిలివేశారు. దీనికి తోడు పంట తగ్గడంతో ధరలు కూడా భారీగా పెరిగాయి. వంద మామిడి పండ్లు రూ.5000 నుంచి రూ.6000 ధర పలుకుతున్నాయి. దీంతో మామిడి పండును కొనుగోలు చేయాలంటేనే వినియోగదారులు భయపడే పరిస్థితులు ఏర్పడ్డాయి.



అరకొరగా కాసిన బంగినపల్లె మామిడి



కృత్రిమ పక్వం

బంగినపల్లి మామిడి పండ్లకు గిరాకీ ఉండటంతో కొందరు వ్యాపారులు ప్రజలను మాయ చేస్తున్నారు. కృత్రిమ పక్వం చేసి ప్రజలను అనారోగ్యం పాలు చేస్తున్నారు. పసుపు పచ్చ రంగులో అచ్చం మాగిన పండు లాగా కనిపించే ఈ కాయలు ఏమాత్రం రుచి లేక పోగా విష తుల్యంగా మారుతున్నాయి. కొందరు వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి పండ్లను తెప్పించుకుని బంగినపల్లి మామిడిగా అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. మామిడి కాయలు పసుపు రంగులో మారాలంటే నిర్దీత సమయం అవసరం. కానీ వ్యాపారులు రంగుమారేలా చేసి పండ్లను అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. రుచి లేకపోవడం, వాటిని తిన్న తర్వాత కడుపులో మంట రావడం వల్ల డబ్బులు ఇచ్చి అనారోగ్యం తెచ్చుకుంటున్నామని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మామిడి పండ్లను సహజ పద్ధతుల్లో మాగబెట్టేవారు. అయితే కృత్రిమ పద్ధతుల్లో వ్యాపారులు మామిడి పండ్ల మాగబెడుతుండటంతో వినియోగదారులు తోటలకు వెళ్లి మామిడి కాయలను కొనుగోలు చేసి ఇంట్లోనే మాగపెడుతున్నారు. దీంతో తోటల్లోని మామిడి కాయలు విపరీతమైన ధర పలుకుతున్నాయి. ప్రస్తుతం వంద మామిడి కాయలు తోటలో రూ.5 వేల నుంచి రూ.6వేల వరకు ధర పలుకుతున్నాయి. బండ్లపై కిలో మామిడి పండ్లు రూ.150కు అమ్ముతున్నారు. చాలా మంది తమ పై అధికారులకు పంపేందుకు తోటల్లోనే కొనుగోలు చేస్తున్నారు. గతంలో మామిడి పండ్లను బాదం గడ్డి, వరి గడ్డితో మాగించేవారు. పండ్లకు మంచి వాసన, రుచి ఉండేది. ప్రస్తుతం వ్యాపారులు పండ్లను కార్బైడ్, ఇతర రసాయనాలతో మాగిస్తున్నారు. దీంతో బంగినపల్లి మామిడి రుచి తగ్గిపోయింది.

ఆకాశన్నంటుతున్న మామిడి పండ్ల ధరలు

బేతంచెర్ల: వేసవి వచ్చిందంటే మామిడి పండ్లు గుర్తుకొస్తాయి. మామిడి పండ్లను చూస్తే నోరూరని వారంటూ ఉండరు. అయితే ఈ ఏడాది వర్షాలుసరిగ్గా లేక మామిడి పంట తక్కువగా ఉండటంతో మామిడి ధరలు ఆకాశాన్నంటుతుండటంతో పేద, మధ్య తరగతి ప్రజలు కొని తినలేని పరిస్థితి నెలకొంది. మండలంలో ఎంబాయి గ్రామంలో మామిడి పండ్లు అంటే తెలియని వారుండరు. బనగానపల్లె బంగినపల్లె మామిడి కన్నా ఎంబాయి మామిడి పండ్లు ప్రసిద్ధి చెందినవి. అయితే.. 100 మామిడి పండ్లు ధర రూ.3,500లు, ఒక కిలో మామిడి రూ.120ల నుంచి రూ.150ల వరకు ధర పలుకుతుండటంతో పేద ప్రజలు మామిడి పండ్లను తినలేని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

ఈ ఏడాది పూర్తిగా నష్టపోయాం



ఈ ఏడాది పూర్తిగా నష్టపోయాం. తేనెమంజు తెగులుతో పంట దెబ్బతింది. దీనికి తోడు వర్షాలు లేక అధిక వేడిమికి పూత రాలిపోయింది. దీంతో పంట 20 శాతం కూడా రాలేదు.

- హమీద్, కౌలు రైతు

మూడు రోజులు వానలు



- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం
- అప్రమత్తంగా ఉండాలంటున్న వాతావరణ శాఖ

కర్నూలు(అగ్రికల్చర్), మే 18: బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో మరో మూడు రోజులు కోస్తాంధ్రతో పాటు రాయలసీమలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నివారణ సంస్థ అధికారులు ప్రకటించారు. ఇప్పటికే నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వాగులు, వంకలకు నీటి ప్రవాహం మొదలైంది. ఇప్పటికే మండుటెండలకు కర్నూలు జిల్లాలోని వాగులు, వంకలతో పాటు హంద్రీ, తుంగభద్ర నదుల్లో చుక్కనీరు లేని పరిస్థితి నెలకొంది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కర్నూలు నగరం మీదుగా ప్రవహిస్తున్న హంద్రీనదిలో నీటి ప్రవాహం మొదలైంది. తుంగభద్ర నదికి ఎగువ ప్రాంతాల్లో వరదనీటి ప్రవాహం మొదలైనట్లు నీటి పారుదల శాఖ అధికార వర్గాలు తెలిపాయి. ద్రోణి ప్రభావంతో జూన్ మొదటి వారంలో కేరళకు నైరుతి రుతుపవనాలు రానున్నాయనీ, దీని వల్ల ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వర్షాలు మొదలవుతాయనీ వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. శనివారం కర్నూలు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిశాయి. కల్లూరులో 52.4 మిల్లీమీటర్ల మేర వర్షపాతం నమోదు కాగా కర్నూలు అర్బన్‌లో 22.6, కర్నూలు రూరల్ 14, మద్దికెరలో 10.2, ఓర్వకల్లులో 4.6 మి.మీ., మేర వర్షం కురిసింది. మే నెలలో సగటున 40.1 మి.మీ., వర్షం కురవాల్సి ఉండగా.. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు 76.4 మి.మీ., వర్షం నమోదైంది. సాధారణం కంటే అదనంగా 36 మి.మీ., వర్షపాతం నమోదైందని అధికారులు వెల్లడించారు.

స్ట్రాంగ్ రూంల అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీనివాసులు



స్ట్రాంగ్‌రూంలలోని సీసీ కెమెరాల పుటేజీని పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి, ఎస్పీ

పాణ్యం, మే 18: మండలంలోని ఆర్జీఎం, శాంతిరాం, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో భద్రపర్చిన పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంల స్ట్రాంగ్ రూంల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టరు డాక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం ఆయనతోపాటు జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జాయింట్ కలెక్టరు రాహుల్‌రెడ్డి, డీఎస్పీ రవీంద్రనాధరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సంతోష్‌కుమార్‌లు స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కమాండ్ కంట్రోల్ వద్దగల సీసీ టీవీ కెమెరాలు పరిశీలించారు. స్ట్రాంగ్ రూంల వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులకు దిశానిర్దేశం చేస్తూ కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా పటిష్ట భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉందన్నారు. కౌంటిగ్ ప్రక్రియ ఆర్జీఎం, శాంతిరాం ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో ఉంటుందని తెలిపారు. జిల్లాలో హింసాత్మక సంఘటనలకు పాల్పడినా, రెచ్చగొట్టే విధంగా వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 144 సెక్షన్ అమలుతో ఎక్కడా నలుగురు మించి గుంపులుగా ఉండరాదన్నారు. స్ట్రాంగ్‌రూం వద్ద ఏర్పాటు చేసిన మూడంచెల భద్రతా చర్యల్లో ఎలాంటి అలసత్వం ఉండరాదన్నారు. నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణలో పహారా ఉండాలని ఆదేశించారు. డీఎస్పీ స్థాయి అధికారి 24 గంటలపాటు భద్రతను పర్యవేక్షిస్తుంటారని తెలిపారు. విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు పికెట్లు, మొబైల్ పెట్రోలింగ్ పార్టీలు నిరంతరం పని చేసేలా ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. జూన్ 4 వతదీ ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్పీ సీఐ వెంకటేశ్వరరావు, పాణ్యం సీఐ నల్లప్ప, ఎస్ఐ అశోక్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కృష్ణా తీరానికి అతిథులు

- సంగమేశ్వరంలో సందడి చేస్తున్న పక్షులు
- ఆహార సేకరణ, సంతానోత్పత్తి కోసం వలస



సంగమేశ్వర క్షేత్రంలోని కృష్ణాతీరంలో సందడి చేస్తున్న వలస పక్షులు







ఆత్మకూరు, మే 18: పక్షులు లేని ప్రపంచాన్ని ఊహించుకోవడం చాలాకష్టం. సృష్టిలోనే అద్భుతమైన, స్వర్గంలోని రాయబారులుగా వీటిని అనువదిస్తారు. అయితే పక్షులు తమ జీవన విధానాల్లో భాగంగా వాతావరణ పరిస్థితులకు తగ్గట్లుగానే ఓ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలసలుగా వెళ్తుంటాయి. అక్కడే కొద్దిరోజుల పాటు ఆహారసేకరణ, సంతానోత్పత్తి చేపట్టి తిరిగి తమ ప్రదేశాలకు చేరుకుంటాయి. అయితే ఆయా ప్రదేశాలకు వలస వచ్చిన పక్షులుగా అతిథులు భావించి వాటిని ఆదరించడం పరిపాటిగా వస్తోంది. సప్తనదీ సంగమేశ్వర క్షేత్ర పరిధిలోని కృష్ణానదీ తీరంలో వలస పక్షులు సందడి చేస్తున్నాయి. వేల మైళ్ల నుంచి ప్రయాణం చేసి ఆత్మకూరు ప్రాంతంలోని కృష్ణాతీరానికి చేరుకుంటున్నాయి. కృష్ణానదీలో జలాలు బయటపడే చేపలను ఆహారం తీసుకుని ఇక్కడే జతకూడి, గుడ్లు పెట్టి తమ సంతతిని అభివృద్ధి చేసుకుంటాయి. పిల్లలకు రెక్కలొచ్చాక వాటిని వెంట పెట్టుకుని మళ్లీ ఎగిరిపోతున్నాయి. కాగా సంగమేశ్వరంలో కొంగ జాతికి చెందిన వివిధ పక్షులు రంగురంగులో ఆకట్టుకుంటున్నాయి. సప్తనదీ సంగమక్షేత్రంలో నదీజలాలు పుష్కలంగా ఉన్నప్పుడు పక్షులు తక్కువగా కనిపిస్తుంటాయి. అదే జలాలు అడుగంటిపోయే కొద్దీ వలస పక్షుల సందడి పెరుగుతోంది. కాగా వెలుగోడు జలాశయం పరిధిలో కూడా వలస పక్షులు సందడి చేస్తుంటాయి.

రాత్రికి రాత్రే ప్రయాణం : సహజంగా పక్షులు పగటిపూట ప్రయాణం చేస్తుంటాయి. అయితే వివిధ దేశాల నుంచి వచ్చే వలస పక్షులు మాత్రం రాత్రివేళల్లో గుంపులుగా ప్రయాణిస్తాయి. వీటి ప్రయాణం సూర్యస్తమయమైన గంట తర్వాత ప్రారంభమవుతోంది. అర్థరాత్రి సమయంలో పూర్తిస్థాయిలో ప్రయాణం చేస్తాయి. పగలంతా ఆహార సేకరణ చేస్తూ విశ్రాంతి తీసుకుంటాయి. రాత్రివేళల్లో ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటం వల్ల పక్షి తనకు కావాల్సిన శరీర ఉష్ణోగ్రతను నియంత్రించుకుంటూ ఎంత దూరం ప్రయాణం చేయగలిగేదని అంచనా వేసుకుంటాయని పక్షుల నిపుణులు పేర్కొన్నారు.

పక్షుల వలసలకు కారణమిదే : జతకట్టి గుడ్లను పెట్టి పిల్లలను పెంచుకోవడానికి వసంత కాలం ఇక్కడ అనుకూలంగా వుంటుంది. ఆహారం సమృద్ధిగా లభిస్తుంది. దీంతో పాటు విదేశాల్లో శీతల తీవ్రత నుంచి బయటపడేందుకు వెచ్చని ప్రదేశాలకు పక్షులు వలసలుగా వస్తుంటాయి. వాతావరణంలో వచ్చే మార్పులు ప్రధానంగా పక్షుల వలసలకు దారితీస్తాయి. వీటి ప్రయాణానికి కావాల్సిన కొవ్వును వాటి శరీరంలో నిల్వ చేసుకుని భూమికి 3వేల అడుగుల ఎత్తులో ఆగకుండా 90గంటల పాటు ప్రయాణించే శక్తి ఉంటుందని అంచనా. సూర్యుడు, నక్షత్రాలను తమ మార్గదర్శకాలుగా చేసుకుని భూమి అయస్కాంత క్షేత్రంలో మార్పులు, నక్షత్రాలతో పాటు వాసన ఆధారంగా సుదూర ప్రాంతాలకు ప్రయాణిస్తాయని పర్యావరణ నిపుణులు పేర్కొంటున్నారు.

బీపీఎం చేతివాటం..!

- రూ.లక్షల్లో ఖాతాదారుల డబ్బు స్వాహా
- శ్రీరంగాపురం పోస్టాఫీసులో అవినీతి
- విచారణ చేపట్టిన పోస్టల్ శాఖ

రుద్రవరం, మే 18: రుద్రవరం మండలంలోని శ్రీరంగాపురం గ్రామంలో బ్రాంచ్ పోస్టాఫీసులో రూ.లక్షల్లో అవినీతి చోటు చేసుకుంది. బ్రాంచ్ పోస్టమాస్టర్(బీపీఎం) చేతివాటం ప్రదర్శించి లక్షల్లో నగదును స్వాహా చేసిన సంఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. దీంతో శనివారం ఉన్నతాధికారులు విచారణ ప్రారంభించారు. ఈ విచారణ మరో మూడు రోజుల పాటు కొనసాగే అవకాశం ఉంది. శ్రీరంగాపురం బ్రాంచ్ పోస్టాఫీసు పరిధిలో శ్రీరంగాపురం, దక్షిణకొట్టాల, తుమ్మలకొట్టాల గ్రామాలు వస్తాయి. ఈ కార్యాలయంలో లబ్ధిదారులు తమ డబ్బును సేవింగ్స్ చేసుకునేవారు. కార్యాలయంలో బీపీఎంగా పనిచేస్తున్న శరత్ నాయక్ ఖాతాదారుల వద్దకు వెళ్లి డబ్బును తాను జమ చేస్తానంటూ నమ్మబలికాడు. దీంతో ప్రభుత్వ ఉద్యోగి కావడంతో ఖాతాదారులు కూడా రికరింగ్ డిపాజిట్‌లు, పోస్టల్ బీమా, సేవింగ్స్ తదితర పథకాలకు సంబంధించి జమ చేయాలంటూ శరత్ నాయక్‌కు డబ్బు ఇచ్చేవారు. ఆ మొత్తాన్ని ఖాతాదారుల ఖాతాలో జమ చేయకుండా సదరు అధికారి తన అవసరాలకు వాడుకున్నారు. ఒక్కసారిగా విషయం బయటకు రావడంతో ప్రజలు బ్రాంచ్ పోస్టాఫీసు వద్దకు చేరుకున్నారు. ఖాతాదారులు, బాధితులతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు.

విచారణ కొనసాగుతోంది

రుద్రవరం మండలంలోని శ్రీరంగాపురం బ్రాంచ్ పోస్టల్ కార్యాలయంలో విచారణ చేపడుతున్నాం. లబ్ధిదారులను ఒక్కొక్కరితో మాట్లాడుతున్నాం. ఒక వ్యక్తి చేసిన తప్పుతో మొత్తం సంస్థకే వచ్చేలా ఉంది. ఇలాంటి వ్యవహారాలను పోస్టల్ శాఖ సీరియస్‌గా తీసుకుంటుంది. విచారణ పూర్తి అయిన తర్వాత చర్యలు తీసుకుంటాం.

- సత్యనారాయణ, అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్

గ్రామ వలంటీరుచే ఉత్తరాలు పంపిణీ..?

శ్రీరంగాపురం గ్రామంలో ఉన్న బ్రాంచ్ పోస్టు కార్యాలయానికి వచ్చిన ఉత్తరాలు, చెక్కులు ఇంకా పలు రకాల కవర్లను, ఓటరు కార్డులను పాన్‌కార్డులను బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ శరత్‌నాయక్ వలంటీర్ల చేత పంపిణీ చేయించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వేలాది రూపాయలు జీతం తీసుకుంటూ ఈ పోస్టల్ కార్యాలయంలో పనిచేస్తున్న శరత్ నాయక్ నిర్లక్ష్యం వహించాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. బ్రాంచ్ పోస్టల్ కార్యాలయంలోనే ఆర్డీ పుస్తకాలు, ఎస్‌బీ పుస్తకాలను అక్కడే నిల్వ చేసేవాడని స్థానికులు వాపోయారు. పుస్తకాలు ఇవ్వండి సార్ అని అడిగితే వచ్చే నెల ఇస్తామని సాకు చెప్పేవాడని ప్రజలు ఆరోపించారు.



పోస్టాఫీసు ఎదుట గుమికూడిన ప్రజలు

టీఎస్ ఈఏపీసెట్ ఫలితాల్లో కర్నూలు విద్యార్థుల హవా

● టాప్ టెన్‌లో మూడు స్థానాలు కైవసం ● కర్నూలు వాసులకు స్టేట్ 2,5వ ర్యాంకు ● ఆదోని విద్యార్థికి స్టేట్ 4వ ర్యాంక్

కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగే లక్ష్యం



తెలంగాణ ఎంసెట్ ఇంజనీరింగ్ విభాగంలో కర్నూలుకు చెందిన గొల్ల లేఖహర్షకు 152.086 మార్కులతో స్టేట్ 2వ ర్యాంకు సాధించారు. కర్నూలు నగరం పంచలింగాల స్కంద గార్డెన్స్‌లో నివాసం ఉంటున్న సూర్య కుమార్, సుహాసిని దంపతులు నివాసం ఉంటున్నారు. సూర్యకుమార్ వైజాగ్‌లోని పోలీస్ కమ్యునికేషన్ విభాగంలో ఎస్పీ కేడర్ స్థాయిలో పనిచేస్తున్నారు. వారి కుమారుడు గొల్ల లేఖహర్ష 1 నుంచి 6వ తరగతి వరకు కర్నూలు కృష్ణానగర్‌లోని కేశవరెడ్డి పాఠశాలలో చదివారు. 7 నుంచి 10వ తరగతి వరకు గుడివాడ కేకే గౌతమి పాఠశాలలో విద్యనభ్యసించారు. విజయవాడ శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్‌లో చదివి 952 మార్కులు సాధించారు. జేఈఈ-మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 311వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా గొల్ల లేఖహర్ష మాట్లాడుతూ జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో బెస్టు ర్యాంకు సాధించి ముంబై, చెన్నై వంటి ప్రముఖ విద్యాసంస్థల్లో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో చేరాలన్నదే తన లక్ష్యమని వెల్లడించారు. ఉత్తమ ర్యాంకు రావడానికి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటు తను చదివిన విద్యాసంస్థల్లో అధ్యాపకుల కృషే కారణమన్నారు.

- గొల్ల లేఖ హర్ష తెలంగాణ ఎంసెట్ ఇంజనీరింగ్ విభాగంలో స్టేట్ 2వ ర్యాంకు

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 18: తెలంగాణ స్టేట్‌లోని ఇంజనీరింగ్, అగ్రికల్చర్, బీ-ఫార్మసీ కళాశాలలో ప్రవేశాల కోసం నిర్వహించిన తెలంగాణ ఈఏపీసెట్ పరీక్ష ఫలితాల్లో కర్నూలు జిల్లా విద్యార్థులు హవా కొనసాగించారు. హైదరాబాద్ విద్యార్థులకు తీసిపోనివిధంగా ఉత్తమ మార్కులు, ర్యాంకులు సాధించి ఔరా అనిపించారు. తెలంగాణ ఎంసెట్ ఇంజనీరింగ్ విభాగంలో కర్నూలు నగరానికి చెందిన గొల్ల లేఖహర్షకు 152.086 మార్కులతో స్టేట్ 2వ ర్యాంకు సాధించారు. కర్నూలు నగరం పంచలింగాల స్కంద గార్డెన్స్‌లో నివాసం ఉంటున్న సూర్య కుమార్, సుహాసిని దంపతుల కుమారుడు లేఖహర్ష సత్తా చాటాడు. ఆదోని టౌన్‌కు చెందిన రామసుబ్బారెడ్డి, రాజేశ్వరి ఆదోనిలో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వారి కుమారుడు సందేశ్ రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు సాధించాడు. అదేవిధంగా కర్నూలు నగరంలోని మారుతి నగర్‌లో నివాసం ఉంటున్న రామేశ్వరరెడ్డి కుమారుడు సాయి యశ్వంత్ రెడ్డి 145.464 మార్కులతో స్టేట్ 5వ ర్యాంకు సాధించాడు. ఇక ఆదోని పట్టణానికి చెందిన మరో విద్యార్థి కూడా సత్తా చాటాడు.

ప్రజలకు సేవ చేయాలని ఉంది



సివిల్ సర్వీసుకు ఎంపికై పేద ప్రజలకు సేవ చేయాలనే సంకల్పం ఉంది. మా పేరెంట్స్ కూడా అటు వైపు నన్ను ప్రోత్సహిస్తున్నారు. నాన్న రామేశ్వరరెడ్డి స్కూల్ బ్యాగ్స్ బిజినెస్ చేస్తున్నారు. అమ్మ గృహిణి. 1 నుంచి ఇంటర్ వరకు గుంటూరు బాష్యం విద్యాసంస్థలో కొనసాగింది. 10వ తరగతి పరీక్షలో 573 మార్కులు సాధించా. ఇంటర్‌లో 980 మార్కులు వచ్చాయి. జేఈఈ-మెయిన్స్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో ఈడబ్ల్యూఎస్ కేటగిరిలో 36వ ర్యాంకును సాధించా. జేఈఈ-అడ్వాన్స్‌డ్ టెస్టుకు ప్రిపేర్ అవుతున్నా. బెస్టు ర్యాంకు సాధించి అత్యుత్తమ విద్యాసంస్థలో బీటెక్‌లో సీఎస్ఈలో చేరాలని ఉంది.

- ముర్రసాని సాయి యశ్వంత్ రెడ్డి, స్టేట్ 5వ ర్యాంకు ఇంజనీరింగ్ విభాగం

తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో ఆదోని వాసికి 4వ ర్యాంక్



సందేశ్

ఆదోని (అగ్రికల్చర్): తెలంగాణ రాష్ట్ర ఈఏపీ సెట్ (ఎంసెట్)-2024 ఫలితాలను ఆ రాష్ట్ర ప్రభుత్వం శనివారం విడుదల చేసింది. ఈ ఫలితాల్లో కర్నూలు జిల్లా ఆదోని పట్టణానికి చెందిన బి.సందేశ్ సత్తా చాటాడు. హైదరాబాద్ నారాయణ జూనియర్ కళాశాల మాదాపూర్ బ్రాంచ్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్న బి.సందేశ్ తెలంగాణ ఈఏపీ సెట్ ఫలితాల్లో 4వ ర్యాంకు సాధించాడు. బి.సందేశ్ తల్లిదండ్రులు రామసుబ్బారెడ్డి, రాజేశ్వరి ఆదోనిలో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. తమ కుమారుడు రాష్ట్ర స్థాయిలో నాలుగో ర్యాంకు సాధించడంపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ పరీక్షల ఫలితాల్లో కూడా సందేశ్ 99.99% మార్కులు సాధించి, 252 ఆల్ ఇండియా ర్యాంక్ సాధించాడు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు సాధించి ఐఐటీ ముంబాయిలో సీఎస్‌సీ చేరుతానని ర్యాంకు సాధించిన బి.సందేశ్ తెలిపారు. కాగా ఇంటర్మీడియట్‌లో 987 మార్కులు రాగా.. పదో తరగతిలో 10/10 సాధించినట్లు తెలిపారు.

నిరంతరం నిఘా ఉంచండి



ఆర్‌యూలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీలు

కర్నూలు(కలెక్టరేట్), మే 18: రాయలసీమ యూనివర్సిటీలోని ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల వద్ద నిరంతర నిఘా ఉండాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన అధికారులను ఆదేశించారు. శనివారం రాయలసీమ యూనివర్సిటీలోని కంట్రోల్ రూమ్‌లో స్ట్రాంగ్ రూమ్‌ల లైవ్ ఫీడ్ ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ ఏర్పాట్లు, మీడియా సెంటర్ ఏర్పాట్లను కలెక్టర్‌తోపాటు జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లైబ్రరీ బ్లాకులోని పత్తికొండ, మంత్రాలయం నియోజకవర్గానికి సంబంధించి ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. ఈ స్ట్రాంగ్ రూముల నుంచి కౌంటింగ్ కోసం బయటకు తెచ్చే ఈవీఎంలను భద్రతా నిమ్మితం ప్రత్యేక గ్యాంగ్వే తరహాలో బ్యారికేడింగ్‌లను ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ సంబంధిత నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో (ఇండోర్ స్టేడియం) మీడియా ప్రతినిధుల కోసం మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. మీడియా సెంటర్‌లో టీవీలు, కంప్యూటర్, ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేయాలని సమాచార శాఖ అధికారిని ఆదేశించారు. వీరి వెంట పత్తికొండ ఆర్వో రామలక్ష్మి, మంత్రాలయం ఆర్వో మురళి, తదితర పోలీసు అధికారులు ఉన్నారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేయాలి

ఆర్ఓ ఎ.భార్గవతేజ

కర్నూలు(న్యూసిటీ), మే 18: కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు పాటిస్తూ జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కర్నూలు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి ఎ.భార్గవతేజ సూచించారు. శనివారం నగర శివారులోని రాయలసీమ యూనివర్సిటీలో 137 కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన స్ట్రాంగ్‌రూమ్‌ను అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లాకళ్యాణితోపాటు ఆర్ఓ సందర్శించారు. విధుల నిమిత్తం కేటాయించిన అన్ని విభాగాల అధికారులు, పోలీస్ సిబ్బంది విధి నిర్వహణ, పని తీరుపై ఆర్ఓ ఆరా తీశారు. స్ట్రాంగ్ రూమ్‌కు వేసిన సీళ్లను పరిశీలించి, పోలీస్ సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు నాటికి ఎలాంటి సాంకేతిక సమస్యలు లేకుండా చూసుకోవాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మోహన్‌కుమార్‌ను ఆదేశించారు. అనంతరం సంబంధిత రిజిస్టర్‌లో సంతకం చేశారు.

చిన్న పిల్లలకు టీకాలు తప్పక వేయించాలి



చిన్నారికి టీకాలు వేస్తున్న డీఎంహెచ్‌వో

కర్నూలు(హాస్పిటల్), మే 18: చిన్న పిల్లలందరికీ తల్లిదండ్రులు తప్పక వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని డీఎంహెచ్‌వో డా.ప్రవీణ్ కుమార్ తెలిపారు. నగరంలోని ఇందిరాగాంధీనగర్ 1వ సచివాలయంలో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. పిల్లలకు టీకాలు ఎంతో దోహదపడుతాయనీ తెలిపారు. గర్భవతులు, 5 సంవత్సరాలలోపు పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పకుండా ఇవ్వాలని, ఆ వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేయాలని తెలిపారు. దీని వల్ల పిల్లలను వ్యాధుల బారిన పడకుండా కాపాడవచ్చునన్నారు. అనంతరం గర్భవతులు, బాలింతలు చిన్న పిల్లలు ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాదికారి నాగసౌమ్యారెడ్డి, డిస్టిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్, ప్రోజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

బాధ్యతతో విధులు నిర్వహించాలి



జిల్లా కలెక్టర్ డా.జి.సృజన

కర్నూలు(కలెక్టరేట్), మే 18: ఎన్నికల కమిషన్ గైడెన్స్ ప్రకారం కౌంటింగ్ విధులను బాధ్యతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4న జరగనున్న కౌంటింగ్ ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్‌లను ప్రొసీజర్ ప్రకారం చేయాల్సి ఉంటుందన్నారు. పార్లమెంటుకు సంబంధించిన ఈవీఎం కౌంటింగ్ ఒక రూములో అసెంబ్లీకి సంబంధించిన ఈవీఎం కౌంటింగ్ ఒక రూములో చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికల కమిషన్ గైడెన్స్ ప్రకారం ప్రతి కౌంటింగ్ హాలులో 14 కౌంటింగ్ టేబుల్స్, 1 రిటర్నింగ్ అధికారి టేబుల్ ఉంటుందన్నారు. 14 టేబుళ్లలో ఒక టేబుల్‌పై మెష్ ఎంక్లోజర్‌తో కూడిన వీవీ ప్యాట్ కౌంటింగ్ బూత్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రిటర్నింగ్ అధికారులతో సమన్వయం చేసుకుని వీవీ ప్యాట్ కౌంటింగ్ బూత్ ఏర్పాటు చేసే పనులు రేపటి నుంచి మొదలు పెట్టాలని ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, టిడ్కో ఎస్ఈలను ఆదేశించారు. కౌంటింగ్ సిబ్బందికి, కౌంటింగ్ ఏజెంట్లకు కౌంటింగ్ హాల్ లోపలికి ఫోన్లు అనుమతించమని స్పష్టం చేశారు. ప్రతి కౌంటింగ్ హాలు వద్ద ఒక మొబైల్ డిపాజిట్ సెంటర్‌ను ఏర్పాట చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మీడియా సెంటరులో కౌంటింగ్ ప్రక్రియ కనిపించే విధంగా స్క్రీన్ ఏర్పాటు చేస్తామన్నారు. ట్రెజరీ స్ట్రాంగ్ రూములలో భద్రపరిచిన పోస్టల్ బ్యాలెట్‌లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కౌంటింగ్‌కు 24 గంటల ముందుగా క్లోజ్డ్ వెహికల్‌లో ట్రాన్స్‌పోర్టు ద్వారా యూనివర్సిటీ వద్దకు తీసుకుని వచ్చి రూములో భద్రపరచాలని పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారిని ఆదేశించారు. సమావేశంలో పాణ్యం ఆర్వో, జేసీ నారపురెడ్డి మౌర్య, కర్నూలు ఆర్వో, నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని ఆర్వో, సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ, అదనపు ఎస్పీ నాగరాజు, కోడుమూరు ఆర్వో, కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, పత్తికొండ ఆర్వో రామలక్ష్మి, ఎమ్మిగనూరు ఆర్వో చిరంజీవి, మంత్రాలయం ఆర్వో మురలి, ఆలూరు ఆర్వో రాము నాయక్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామి అలంకారంలో
జ్వాలా నరసింహ స్వామి



వేణుగోపాలస్వామి అలంకారంలో జ్వాలా నరసింహస్వామి

ఆళ్లగడ్డ, మే 18: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఎగువ అహోబిలంలో జ్వాలా నరసింహస్వామి భక్తులకు వేణుగోపాలస్వామి అలంకారంలో భక్తులకు శనివారం దర్శనమిచ్చారు. వైశాఖ మాస నృసింహస్వామి జయంతి బ్రహ్మోత్సవాలు వేద మంత్రోచ్ఛారణల మధ్య ఘనంగా జరుగుతున్నాయి. ఇందులోభాగంగా వేకువ జామున్నే ఉత్సవమూర్తి జ్వాలా నరసింహస్వామిని విశేషంగా అలంకరించి పూజల అనంతరం అభిషేకించారు. స్వామి వారిని వేణుగోపాలస్వామి అలంకారంలో వేదపండితులు అలంకరణ చేసి మాఢవీదుల్లో విహరింప చేశారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

ఖాతాదారుడి ఖాతాలో రూ.5లక్షలు మాయం

పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు



వివరాలు వెల్లడిస్తున్న బీసీ పాయింట్ నిర్వాహకుడు, బాధితుడు షేక్ ఇబ్రహీం

ఎమ్మిగనూరు, మే18: కర్నూలు జిల్లాలో సైబర్ నేరగాళ్ల చెలరేగిపోతున్నారు. తాజాగా ఎమ్మిగనూరు మండలంలోని కోటేకల్లు గ్రామానికి చెందిన షేక్ ఇబ్రహీం అనే బ్యాంకు ఖాతాదారుడి నుంచి సైబర్ నేరగాళ్ల రూ.5లక్షలు కొట్టేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. కోటేకల్ గ్రామానికి చెందిన షేక్ ఇబ్రహీం ఎమ్మిగనూరులో యునియన్ బ్యాంకుకు చెందిన బీసీ పాయింట్(బిజినెస్ కరస్పాండెంట్) నిర్వహిస్తున్నాడు. ఇందులో బాగంగా శుక్రవారం ఎమ్మిగనూరు పట్టణంలోని బ్యాంకుకు వచ్చిన సమయంలో సెల్‌ఫోన్‌ను హ్యాక్ చేసి ఈ బ్యాంకింగ్ ద్వారా ఇతర ఖాతాలకు నగదును సైబర్ నేరగాళ్ల బదిలీ చేసుకున్నట్లు ఇబ్రహీం తెలిపాడు. తన ఖాతాలో డబ్బు మాయం కావడాన్ని గుర్తించి ఏ బ్యాంకు ఖాతాలకు నగదు బదిలీ అయిందో వాటి వివరాలను సేకరించాడు. రాజస్థాన్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుఖాతాకు, హరియాణకు చెందిన బ్యాంకు ఖాతాకు నగదు జమ అయినట్లు గుర్తించాడు. శనివారం ఎమ్మిగనూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసి వివరాలను అందించాడు. పట్టణ పోలీసులు బీసీ పాయింట్ నిర్వాహకుడి ఫిర్యాదుపై దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవలి కాలంలో సైబర్ నేరగాళ్ల జనం బ్యాంకు ఖాతాలనుంచి నగదును మాయం చేస్తుండటంతో ఖాతాదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బుల్లెట్ బైక్ ధ్వంసం.. కేసు నమోదు

కొలిమిగుండ్ల రూరల్, మే 18: మండలంలోని బెలుం గ్రామంలో పాత కక్షలు మనుసులో పెట్టుకొని లక్ష్మీనారాయణ అనే వ్యక్తికి సంబంధించిన బుల్లెట్ బైక్ ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు కొలిమిగుండ్ల ఏఎస్ఐ గోవిందనాయక్ శనివారం తెలిపారు. లక్ష్మీనారాయణ తన ఇంటి వద్ద బైక్ పార్కు చేసి ఉండగా అదే గ్రామానికి చెందిన చాకలి చిన్నకుళాయి, వరలక్ష్మి, పోతరాయుడు, అనే వ్యక్తులు ఇంటి వద్ద రస్తా విషయంలో మనుసులో ఉంచుకొని బైక్‌పై కర్రలతో దాడి చేశారని, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెల్లడించారు.

గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి మోహన్ రెడ్డి



డా.జి.మోహన్ రెడ్డి

కర్నూలు(హాస్పిటల్), మే 18: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతిగా డా.జి.మోహన్‌రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వి.వెంకటరంగారెడ్డి సమక్షంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఖాళీగా ఉన్న గ్యాస్ట్రో ఎంట్రాలజీ ప్రొఫెసర్ పోస్టుకు ఆయన్ను నియమించారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి డా.మోహన్‌రెడ్డి 6వ హెచ్‌వోడీగా కొనసాగనున్నారు. నూతనంగా హెచ్‌వోడీగా బాధ్యతలు చేపట్టిన డా.మోహన్ రెడ్డికి ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు అభినందనలు తెలిపారు.

ఆయిల్ ఫామ్ సాగుతో ఆదాయం

● రాయితీలను సద్వినియోగం చేసుకోండి
● ఉద్యానశాఖ అధికారి రామాంజనేయులు

కర్నూలు(అగ్రికల్చర్), మే 18: జిల్లాలోని రైతులు మార్కెట్లో ధర ఎక్కువగా ఉండే పంటలపై దృష్టి సారించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రామాంజనేయులు సూచించారు. కర్నూలు జిల్లాలో ఆయిల్ ఫామ్ పంట సాగుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయనీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పంట సాగుకోసం అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నాయని తెలిపారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ... కర్నూలు జిల్లాలో క్రిష్ణగిరి, ఆదోని, కర్నూలు, సీ.బెళగల్, హోళగుంద, గోనెగండ్ల, కోసిగి, మంత్రాలయం, కౌతాళం, ఎమ్మిగనూరు, నందవరం, పెద్దకడుబూరు, హాలహర్వి మండలాల్లో ఆయిల్ ఫామ్ సాగుకు ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిందని తెలిపారు. ఈ మండలాల్లో ఆయిల్ ఫామ్ సాగుకు కంపెనీలను కూడా ప్రభుత్వం అలాట్ చేసిందన్నారు. పతంజలి ఫుడ్ లిమిటెడ్‌కు సి.బెళగల్, గోనెగండ్ల మండలాలను ప్రభుత్వం కేటాయించిందన్నారు. అదేవిధంగా ఎమ్మిగనూరు, ఆదోని, కర్నూలు, క్రిష్ణగిరి మండలాలకు నవభారత్ కంపెనీకి, మంత్రాలయం, హాలహర్వి, కోసిగి, నందవరం, హోళగుంద, పెద్దకడుబూరు మండలాలను లివింగ్ ఫుడ్స్ సంస్థకు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఇప్పటికే పతంజలి ఫుడ్స్ సంస్థ సీ.బెళగల్ మండలంలో రైతుల చేత ఆయిల్‌ఫామ్ సాగుకు చర్యలు చేపట్టిందన్నారు.

హెక్టారుకు రూ.21వేల రాయితీ

ఆయిల్ ఫామ్ సాగు కోసం రైతులకు ప్రభుత్వం హెక్టారుకు రూ.21వేల రాయితీ ఇస్తోందన్నారు. ఏడాదికి రూ.5,250ల ప్రకారం నాలుగేళ్లు ఈ రాయితీని రైతులకు అందిస్తుందని, నేషనల్ మిషన్ ఆన్ ఆయిల్ సీడ్స్ అండ్ ఆయిల్ ఫామ్ ఈ రాయితీని అందిస్తోందన్నారు. ఆయిల్ ఫామ్ పంట సాగుకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వేసవి శిక్షణా శిబిరాలు ప్రారంభం

కర్నూలు(స్పోర్ట్స్), మే 18: కర్నూలు నగర పాలక సంస్థ సహకారంతో డీఎస్ఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు పిలుపునిచ్చారు. శనివారం శిక్షణా శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 15వ తేదీ వరకు ఈ శిక్షణా శిబిరాలు కొనసాగుతాయన్నారు. 8 నుంచి 16 సంవత్సరాల బాలబాలికలు వివిధ క్రీడాంశాలలో వారికి నచ్చిన శిక్షణకు హాజరు కావచ్చని తెలిపారు. ఎయిర్ రైఫిల్ షూటింగ్, అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, కిక్ బాక్సింగ్, కబడ్డీ, రగ్బీ, సీలంబమ్, సెపక్‌తక్రా, తైక్వాండో, చౌక్‌బాల్, వాలీబాల్, ఉషూ, యోగా తదితర విభాగాల్లో శిక్షణ ఉంటుందన్నారు.

కాన్వకేషన్‌కు 31 వరకు దరఖాస్తులు

కర్నూలు(అర్బన్), మే 18: రాయలసీమ యూనివర్సిటీలో జూన్‌లో 4వ కాన్వకేషన్‌నిర్వహించనున్నట్లు ఉపకులపతి బీ సుధీర్ ప్రేమ్ కుమార్ తెలిపారు. 2022-23 విద్యా సంవత్సరం ముగిసే నాటికి అర్హత సాధించిన విద్యార్థులు కాన్వకేషన్‌కు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో ధరఖాస్తులను సమర్పించడానికి ఈ నెల 31 వరకు మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు.

మద్దిలేటి స్వామి క్షేత్ర ఆదాయం రూ.6.77 లక్షలు

బేతంచెర్ల, మే 18: మద్దిలేటి నరసింహస్వామి క్షేత ఆదాయం రూ.6.77 లక్షలు సమకూరినట్లు ఉప కమిషనర్, ఆలయ నిర్వహణాధికారి రామాంజనేయులు, చైర్మన్ సీతారామచంద్రుడు శనివారం తెలిపారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు ఉమ్మడి జిల్లాల నుంచే గాక తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులు వేకువజాము నుంచే స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, గండ దీపాలు, ప్రత్యేక పూజలు చేసి పుట్టు వెంట్రుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్వామి సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదం, కేశఖండన, రూము బాడుగలు, లీజుల వసూళ్ల ద్వారా రూ.6,77,315 దేవస్థానానికి ఆదాయం లభించినట్లు వారు తెలిపారు.

గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి పెరిగిన రోగులు

కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.వి.వెంకట రంగారెడ్డి



మాట్లాడుతున్న డా.వి.వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్), మే 18: గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి వచ్చే రోగుల సంఖ్య పెరిగిందని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా.వి.వెంకటరంగారెడ్డి అన్నారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయిలో రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. 2015 నుంచి ఈ విభాగాలు దినదినాభివృద్ధి చెందుతూ వస్తున్నాయని, ఇప్పటి వరకు 9 మంది పీజీలు కోర్సును పూర్తి చేసుకుని వైద్యులుగా బయటకు వెళ్లారని అన్నారు. ప్రతి రోజూ 60 మంది రోగులకు చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ఇటీవల రూ.32 లక్షలతో ఎండోస్కోపి, కొలానోస్కోపి, ఈఆర్‌సీపీ స్కోపి పరికరాలను అందుబాటులోనికి తెచ్చి రోగులకు సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మెడిసిన్ ప్రొఫెసర్ విద్యాసాగర్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ దీపక్, ఆర్షియా, సందీప్ కుమార్ రెడ్డి, పీజీలు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వెస్ట్రన్ కాలనీలో చిరుత సంచారం

సీ టైప్ క్వార్టర్స్ కుక్కపై దాడి

శ్రీశైలం, మే 18: శ్రీశైలం మండలం సుండిపెంట గ్రామంలోని వెస్ట్రన్ కాలనీలో చిరుత సంచారం కలకలం రేపింది. వెస్ట్రన్ కాలనీలోని సీ టైప్ క్వార్టర్స్‌లో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ పెంపుడు కుక్కపై చిరుత దాడి చేసి చంపేసింది. ఈ ఘటనతో స్థానికులు భయభ్రాంతులకు గురై అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి చిరుత సంచరించిన గుర్తులను సేకరించారు. ఉన్నతాధికారులకు సమాచారం అందజేశారు. అటవీ ప్రాంతానికి సమీపంలో ఉంటున్న వారు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు అవగాహన కల్పించారు. అదేవిధంగా చిరుతను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.



చిరుత దాడిలో మృతి చెందిన కుక్కను పరిశీలిస్తున్న అధికారులు

'నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు'



నందికొట్కూరులో విత్తన దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏవో

నందికొట్కూరు రూరల్, మే 18: డీలర్లు రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని నందికొట్కూరు మండల వ్యవసాయాధికారి షేక్షావలి హెచ్చరించారు. నందికొట్కూరులోని పల్లవి సీడ్స్ దుకాణాన్ని శనివారం ఏవో తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ అనుమతి ఉన్న విత్తనాలను మాత్రమే విక్రయించాలని ఆదేశించారు. విత్తన డీలర్లు సరైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని, అలాగే స్టాక్ రిజిస్టర్లు నికర నిల్వలకు సమానంగా ఉండాలని అన్నారు. లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, ఇన్‌వాయిస్‌లు, బిల్‌బుక్‌లు, స్టోర్ ఆఫ్ సర్టిఫికెట్స్‌ను పరిశీలించారు. రైతులు కూడా కచ్చితంగా ధ్రువీకరించిన విత్తనాలనే కొనుగోలు చేయాలన్నారు.

'టీడీపీదే అధికారం'



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి గిరీశ్వరరెడ్డి

జూపాడుబంగ్లా, మే 18: టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి గిరీశ్వరరెడ్డి, మండల కన్వీనర్ వెంకటేశ్వర్లుయాదవ్ అన్నారు. శనివారం జూపాడుబంగ్లాలోని టీడీపీ కార్యాలయంలో ఓటర్లకు కృతజ్ఞత కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా జూపాడుబంగ్లా మండలంలో అత్యధిక శాతం ఓటింగ్‌శాతం నమోదు అయిందని చెప్పారు. వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగి, ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేశారని అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే చంద్రబాబు రూపొందించిన సూపర్ 6పథకాలు ప్రతి ఒక్కరికీ దరిచేరుతాయని అన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చే వరకు ఓపికతో ఉండాలని, ఎటువంటి గొడవలకు వెళ్లోదని అన్నారు. ఎన్నికల్లో పాల్గొని పార్టీకి అండగా నిలిచిన ప్రతి టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, ఓటర్లందరికి కృతజ్ఞత తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు గెంగ్రెడ్డి మోహన్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాసులు, రవికుమార్ యాదవ్, రవికాంత్, బాలమద్దిలేటి, హనుమంతరెడ్డి, మన్సూర్‌బాషా, శాలు బాషా, ఉసేనయ్య తదితరులు పాల్గొన్నారు.

'బాధిత కటుంబాన్ని ఆదుకుంటాం'



నగదును అందజేస్తున్న ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి

మహానంది, మే 18: మహానంది ఆలయంలో ఏజెన్సీ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తూ ఇటీవల పరిసరాల్లో చిగురు సేకరణ కోసం వెళ్లి చింతచెట్టు నుంచి జారి పడి మృతి చెందిన గోవిందు కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకొంటామని ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. చేయూత కింద ఆలయ ఉద్యోగులు సేకరించిన రూ.53 వేల నగదును శనివారం గోవింద్ భార్య భూలక్ష్మికి ఈవో అందచేశారు. ఈవో మాట్లాడుతూ గోవిందు ఆకాల మృతి బాధాకరమని అన్నారు. కార్యక్రమంలో ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవిశంకర్ అవధాని, ఏఈవో ఎర్రమల్ల మధు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌కు మెమో జారీ

మహానంది, మే 18: పాదరక్షలు భద్రపరుచు హక్కు పొందిన కాంట్రాక్టర్ వేణుగోపాల్‌రెడ్డికి మెమో జారీ చేసినట్లు ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. రూ.5 బదులుగా రూ.10 వసూలు చేస్తున్నట్లు భక్తులు నుంచి ఫిర్యాదు రావడంతో కాంట్రాక్టర్‌కు మెమో జారీ చేశామని చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి.. హైదరాబాద్‌కు చెందిన కార్తీక్ అనే భక్తుడు శనివారం కుటుంబ సభ్యులతో కలసి మహానందికి వచ్చారు. చెప్పుల స్టాండ్ వద్ద తమ చెప్పులను వదిలి దర్శనానికి వెళ్లారు. అనంతరం బయటకు వచ్చిన తర్వాత తమ పాదరక్షలు ఇవ్వాలని కోరారు. అయితే జతకు రూ.10 ఇవ్వాలని డిమాండ్ చేశారని, బోర్డు మీద రూ.5 మాత్రమే ఉందని ప్రశ్నించడంతో డబ్బులు వసూలు చేసేవారు తమపై దురుసుగా ప్రవర్తించారని భక్తులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డికి బాధిత భక్తులు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఈవో కాంట్రాక్టర్‌కు మెమో జారీ చేశారు.

'సమస్యలు పరిష్కరించాలి'

గోస్పాడు, మే 18: మండలంలోని సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ ఆర్థర్ సైమన్ అధికారులను కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖల్లో జరుగుతున్న పనులను గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుగుణశ్రీ, మండల ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, రాజు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు'

పాణ్యం, మే 18: మండలంలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టినట్లు ఎంపీడీవో భాగ్యలక్ష్మి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ పాణ్యం ఎస్సీ కాలనీ, బోయపేటలో తాగు నీటి ఎద్దడి ఏర్పడడంతో ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని చెప్పారు. వేసవి తీవ్రతతో భూగర్భ జలాలు తగ్గి తాగునీటి ఎద్దడి ఏర్పడినట్లు తెలిపారు. అలాగే వర్షాధారిత గ్రామాలైన కందికాయ పల్లి, పిన్నాపురం, తమ్మరాజు పల్లెలో తాగునీటి ఎద్దడి నివారణపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. ఇప్పటికే ఈ గ్రామాల సర్పంచ్‌లకు, కార్యదర్శులకు తాగునీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మధుశేఖర్ పాల్గొన్నారు.

వైభవంగా వాసవీమాత జయంతి



నంద్యాలలో అమ్మవారి పూజల కోసం కలశం తీసుకొస్తున్న 108 మంది యువతులు



నంద్యాల, ఆత్మకూరులో ప్రత్యేక అలంకరణలో వాసవీమాత

నంద్యాల కల్చరల్, మే 18: వాసవీమాత జయంతి వేడుకలు శనివారం వాసవి భక్తుల సమక్షంలో నంద్యాల పట్టణంలో నిర్వహించారు. పట్టణంలోని వాసవీమాత ఆలయంలో మూల విరాట్‌కు వివిధ రకాల పండ్ల ద్రవ్యాలతో పాటు కుంకుమ, చందనాది జలాలతో అర్చకులు విశేష అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశి శ్రీనివాస్ చేతుల మీదుగా వైశ్య పతాకావిష్కరణ చేయించారు. అమ్మవారి ఆలయం ఎదుట ఉన్న కల్యాణ మంటపంలో వేలాదిమంది వాసవి భక్తులతో కుంకుమార్చన నిర్వహింపజేశారు. 108 మంది యువతులు కలశాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలో వెలసిన వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం అమ్మవారి జన్మదిన వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే వాసవీమాతకు శ్రీసూక్త అభిషేకాలు, గణపతి, నవగ్రహహోమాలు, వాసవీ నవగ్రహ, సహస్ర లలితా నామాలచే హోమాలను చేపట్టారు. అదేవిధంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి ఆర్యవైశ్య మహిళలతో అష్టోత్తరనామాలు, కుంకుమార్చన క్రతువులను శాస్త్రోక్తంగా జరిపించారు.

నిమిషాంబ దేవికి పూజలు



ప్రత్యేక అలంకరణలో నిమిషాంబ దేవి

నంద్యాల కల్చరల్, మే 18: నంద్యాల పట్టణంలోని ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో వెలసిన నిమిషాంబ దేవి ఆలయంలో శనివారం అమ్మవారి జయంతి ఉత్సవాలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో ఉదయం విశేష పూజలతో పాటు భక్తి శ్రద్ధలతో కుంకుమార్చన పూజలనిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

నెహ్రూనగర్‌లో నీటి ఎద్దడి

- వారం రోజులుగా సరఫరా కాని నీరు
- ట్యాంకుల వద్ద గంటల తరబడి నిరీక్షణ
- తప్పని పరిస్థితుల్లో నీటికి కొంటున్న గ్రామస్థులు



కొనుగోలు చేసిన ట్యాంక్ వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు



మినీ ట్యాంకుల వద్ద బిందెలను క్యూలో పెట్టిన ప్రజలు

పగిడ్యాల, మే 18: మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో వారం రోజుల నుంచి తీవ్ర నీట్టి ఎద్దడి నెలకొనడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజులకు పైగా వీధి కొళాయిలకు నీరు సరఫరా కాకపోవడంతో గ్రామంలోని ట్యాంక్‌లు, వ్యవసాయ బోర్ల వద్దకు పరుగులు తీయాల్సి వస్తోందని ప్రజలు చెబుతున్నారు. గ్రామంలోని పలు మినీట్యాంక్‌ల వద్ద బిందెలను వరుసలో ఉంచి నీటి కోసం గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొందని మహిళలు అంటున్నారు. నీటి కోసం వృద్ధులు, పిల్లలు, మహిళలు సైకిళ్లు, బైక్‌లపై బిందెలను తీసుకొని పరుగులు తీస్తున్నారు. మరికొంత మంది తప్పనిపరిస్థితిలో నీటి కోసం ట్యాంకర్లకు రూ.1000 నుంచి 1500 చెల్లించి నీటిని తెచ్చుకోవాల్సి దుస్థితి నెలకొంది. గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కారించాలని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్తున్నా సరైన సమాధానం ఇవ్వడం లేదని మహిళలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్‌ను వివరణ అడగ్గా గ్రామంలో నీటి సమస్య ఉందన్న విషయం తమకు తెలియదని, గ్రామ పంచాయతీ సిబ్బందిని అడగాలని చెప్పడం ఆశ్చర్యం. పంచాయతీ కార్యదర్శి మల్లికార్జునను వివరణ అడగ్గా విద్యుత్ సమస్య ఉండటం వల్ల నీటి ఇబ్బంది నెలకొందని చెప్పారు. గ్రామానికి నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు గురైందని, విద్యుత్ అధికారులు మరమ్మత్తులు చేపట్టిన వెంటనే నీటిని సరఫరా చేస్తామని చెప్పారు.

కలశాల ప్రతిష్ఠ



గాలిగోపురంపై ప్రతిష్ఠించడానికి సిద్ధంగా ఉంచిన కలశాలు

పాణ్యం, మే 18: వీరనారాయణ స్వామి ఆలయ జీర్ణోద్ధరణ, కలశ స్థాపన కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించినట్లు ఈవో సువర్ణ తెలిపారు. కాశిరెడ్డి నాయన ఆశ్రమాల నిర్వాహకులు రామచంద్రా రెడ్డి సహకారంతో శిథిలావస్థకు చేరిన కలశాల స్థానంలో నూతన కలశాలను ప్రతిష్ఠించినట్లు తెలిపారు. ఆలయ గాలిగోపురానికి శిల్పాలు, రంగులు వేస్తున్నట్లు తెలిపారు. ఆలయ అర్చకులు సుబ్బశాస్త్రి, కృష్ణశాస్త్రి ఆధ్వర్యంలో కలశాలకు గణపతి పూజ, పూర్ణ కలశం తదితర పూజలు నిర్వహించి కలశాలను ప్రతిష్ఠించినట్లు తెలిపారు. వీరబ్రంహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవం నిర్వహించారు. కార్యక్ర మంలో ఆలయ సిబ్బంది, భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అలరించిన భక్తి గీతాలు



గీతాలను ఆలపిస్తున్న గాయకులు

శ్రీశైలం, మే 18: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో శనివారం నంద్యాలకు చెందిన స్వరమాధురి ఇనిస్ట్యూట్ ఆఫ్ క్లాసికల్ మ్యూజిక్, రామ స్కూల్ ఆఫ్ కర్ణాటక మ్యూజిక్ బృందంతో భక్తి సంగీత కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. కార్యక్రమంలో మహాగణపతిం, సాంబశివా, విశ్వేశ్వరాయ, శివాయ పపరమేశ్వరాయ, బో..శంబో, శివశంబో, శ్రీశైలవాసా తదితర గీతాలను అహల్య, ఇందు, సౌమ్య, శ్రీలత, శ్రియ, ప్రతిభ, మాధురి, కేశవహరిచరణ్, స్వేచ్ఛారెడ్డి, తరుణ్, వైష్ణవి, వందిత, గాయత్రి తదితరులు ఆలాపించారు.

శాశ్వత అన్నదాన పథకానికి విరాళం



భక్తులకు ప్రసాదాలను అందజేస్తున్న ఏఈవో

శ్రీశైలం, మే 18: శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకానికి శనివారం హైదరాబాద్‌కు చెందిన కె. నాగవెంకటేశ్వరరావు అనే భక్తుడు రూ. 1,01,116 విరాళాన్ని పర్యవేక్షకురాలు హిమబిందుకు అందజేశారు. అలాగే బెంగళూరుకు చెందిన పీవీ రవీంద్ర అనే భక్తుడు కుటుంబ సమేతంగా కలిసి రూ. లక్ష విరాళాన్ని ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి ఫణిధర్‌ప్రసాద్‌కు అందజేశారు. దేవస్థానం అధికారులు దాతకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్ర పటాన్ని అందజేసి సత్కరించారు.



భక్తుడికి ప్రసాదం అందజేస్తున్న పర్యవేక్షకురాలు హిమబిందు

విద్యారంగ సమస్యలపై పోరాటం

- ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న హృదయరాజు

నంద్యాల (నూనెపల్లె), మే 18: రాష్ట్రంలో ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యారంగ సమస్యలపై ఏపీటీఎఫ్ పోరాటం చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు అన్నారు. శనివారం నంద్యాలలోని హోలిక్రాస్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన హృదయరాజు మాట్లా డుతూ సామాజిక భద్రత లేని సీపీఎస్ రద్దు అయ్యేంతవరకు పోరాటం చేస్తామన్నారు. శాస్త్రీయమైన విద్యావిధానం పేస్కేల్స్ కోసం నిర్విరామంగా పోరాడతామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో విధంగా పారితోషికాన్ని ఇచ్చారని విధులు చేశాక డ్యూటీ సర్టిఫికెట్లు కూడా ఇవ్వలేదని, వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా అధ్యక్షుడిగా మాధవ స్వామి, ప్రధాన కార్యదర్శిగా నగిరి శ్రీనివాసులు, జిల్లా సహాధ్యక్షుడిగా ఉమర్, ఉపాధ్యక్షులుగా జనార్దన్ రెడ్డి, శ్రీదేవి, అదనపు కార్యదర్శిగా పుల్లయ్య, కార్యదర్శులుగా శ్రీరాములు, రవి, పవన్‌కుమార్‌తో పాటు జిల్లా మహిళ ప్రతినిధులు, 18 మంది రాష్ట్ర కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పశువైద్య శాఖ సిబ్బంది నిర్లక్ష్యం

- కుక్కదాడిలో గాయపడ్డ వానరం మృతి

పాణ్యం, మే 18: ఉదయం 8 నుంచి సాయంత్రం 5 వరకే డ్యూటీ సమయం అని పశువైద్య సంచార వాహన సిబ్బంది సమాధానమిచ్చారు. శనివారం స్థానిక తిరుమలగిరిలో కుక్కల దాడిలో తీవ్రం గా గాయపడి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న కోతికి అత్యవసర చికిత్స కోసం సమీప కాలనీవాసులు 1962 నెంబరుకు ఫోన్ చేశారు. దీనికి సమాధానంగా ఇప్పుడు ఎవరూ లేరని, అంబులెన్స్ సిబ్బంది రారని సమాధానమిచ్చారు. దీంతో కాలనీ వాసులు పశువైద్య శాఖ ఏడీ కమలాకర్‌కు ఫోన్ చేయడంతో ఆయన స్పందించారు. మందులతో సిబ్బందిని ఘటనా స్థలానికి పంపించారు. అయితే అప్పటికే వానరం చనిపోయినట్లు నిర్ధారించారు.

కంకర తేలిన రోడ్డు



గుంతలమయంగా మారిన పాములపాడు-చెలిమిళ్ళ రహదారి

పాములపాడు, మే 18: మండలంలోని గ్రామీణ రహదారులు గుంతల మయంగా మారాయి. కంకర తేలి అధ్వానంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుడుతున్నారు. పాములపాడు నుంచి చెలిమిళ్ళ, ఇస్కాల, శాంతినిలయం తదితర గ్రామాలకు వెళ్లే గ్రామాల రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. నేషనల్ హైవే పనులకు సంబంధించి భారీ వాహనాలు తిరుగుతుండంతో రహదారులు గుంతలమయంగా మారాయని వాహనదారులు చెబుతున్నారు. నిత్యం ఆ రహదారుల వెంటే ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలు



నల్లకాలువ గ్రామంలో ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు



మిడుతూరులో..

ఆత్మకూరురూరల్, మే 18: ఆత్మకూరు మండలంలోని కరివేన, కృష్ణాపురం,నల్లకాలువ గ్రామాల్లోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాల్లో వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆరాధన మహోత్సవాలను విశ్వబ్రాహ్మణులు, ఆయా గ్రామస్థుల ఆధ్వర్యంలో శనివారం వైభవంగా నిర్వహించారు. వీరబ్రహ్మేంద్ర స్వామి సజీవ సమాధి అయ్యి నేటికి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ ఆరాధన మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ముందుగా ఆయా ఆలయాల్లో ఆలయ పురోహితుల ఆధ్వర్యంలో గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామికి పంచామృతాలతో అభిషేకాది క్రతువులు నిర్వహించి, ప్రత్యేక అలంకరణ గావించి, ప్రత్యేక పూజలు చేపట్టారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ ఆరాధన మహోత్సవాల్లో పాల్గొన్నారు. విచ్చేసిన భక్తాదులకు ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మిడుతూరు: మద్విరాట్ వీరబ్రహ్మేద్ర స్వామి ఆరధన మహోత్సవం సందర్భంగా శనివారం వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబ దంపతుల, సిద్ధయ్య గార్ల ఉత్సవ విగ్రహాలు కాతా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మిడుతూరు గ్రామ పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగింపుగా తిరగాయి. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి టెంకాయ, కర్పూరాలు సమర్పించి ఆశీర్వాదం పొందారు.

మహానందిలో భక్తుల రద్దీ



మహానందిలో దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

మహానంది, మే 18: మహానంది క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ కొనసాగింది. వేసవి సెలవులు కావడంతో కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు దర్శనార్థం క్షేత్రానికి రావడంతో పరిసరాల్లో భక్తుల సందడి నెలకొంది. కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరుని దర్శనం చేసుకోవడానికి వర్షాన్ని సైతం లెక్క చెయ్యక క్యూలో నిల్చున్నారు. ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి సిబ్బంది సహాయంతో ప్రత్యేక చర్యలు తీసుకొన్నారు. దేవస్థానానికి వివిధ సేవల ద్వారా రూ.లక్షలాది ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు.

21, 22 తేదీల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం

నంద్యాల టౌన్, మే 18: నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో కొన్ని ప్రాంతాలకు రెండు రోజుల పాటు మంచినీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెక్కె ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్‌లో అమృత్ పథకం కింద పైపులైన్ ఇంటర్ కనెక్షన్ పనులను ఈనెల 21, 22వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పనుల కారణంగా ఎన్‌జీవో కాలనీ, విశ్వనగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, లలితా నగర్, నూనెపల్లె, కంసాల వీధి, మంచినీళ్ల బావి, ఎస్‌బీఐ కాలనీలో తాగునీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని చెప్పారు. అలాగే సరస్వతినగర్, గోపాల్ నగర్, గిరినాథ్ సెంటర్, నంద్యాల గార్డెన్స్, సాయిబాబానగర్, దేవనగర్, వీసీ కాలనీ, హనీఫ్ నగర్, శ్యామ్‌నగర్, గ్రీన్ సిటీ ప్రాంతాల్లో కూడా నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. ఆర్‌ఎఫ్‌రోడ్డు, బొగ్గులైన్, గట్టాలనగర్, గాంధీనగర్, ఇస్లామ్ పేట, బలిజ పేట, గొల్లపేట, బొమ్మల సత్రం, విజయనగర కాలనీ, ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఏరియా ప్రాంత్రాలకు నీటి సరఫరా ఉండదని చెప్పారు. షాదిక్‌నగర్, నివర్తిపురం, ఏకలవ్యనగర్, ప్రభుత్వాసుపత్రి ఏరియా, విజయభాను కాటన్ మిల్ ఏరియా, శంకరయ్య వీధి, దర్గా సందు, కొలిమిపేట, భూమానగర్, బెన్ని కాంప్లెక్స్, వినాయకనగర్‌లో అంతారాయం ఉంటుందని, ప్రజలు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. ప్రజలందరూ 19, 20 వ తేదీల్లో మున్సిపాలిటీ సరఫరా చేసే నీటిని నిల్వ చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

'చదువుపై దృష్టి సారించాలి'

పగిడ్యాల, మే 18: వేసవిలో విద్యార్థులకు ఆటలతో పాటు చదువుపై దృష్టి సారించేందుకు గ్రంథాలయాలల్లో వేసవి విజ్ఞాన శిబిరాలను ఏర్పాటు చేసినట్లు గ్రంథాలయ అధికారి మద్దమ్మ తెలిపారు. పగిడ్యాల గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు పుస్తక పఠనంతో పాటు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు వేసవిలో గ్రంథాలయాలకు వచ్చి విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు.

అసంపూర్తిగా వంతెన



పారుమంచాల వద్ద ఇసుకవాగుపై అసంపూర్తిగా నిలిచిన వంతెన పనులు

జూపాడుబంగ్లా, మే 18: ఇసుకవాగుపై వంతెన పనులు పూర్తిచేసి ఇతర గ్రామాల ప్రజలకు ఇబ్బందిలేకుండా చేస్తామని... మార్చిలోపు పనులు పూర్తిచేస్తామని గతేడాది ఆగస్టు 8వ తేదీ ముఖ్య అతిథిగా పాల్గొని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్న మాటలివి. మే నెల పూర్తి కావస్తున్నా అధికారులు, కాంట్రాక్టర్లు పనులు చేయకుండా వదిలేశారు. 20 రోజుల్లో వర్షకాలం ప్రారంభం కానుందని, పనులు మాత్రం ఎక్కడవేసి గొంగలి అక్కడే అనే చందంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. మంత్రి ఇచ్చిన మాటలకే దిక్కులేదని, వర్షం వస్తే మళ్లీ వాగుదాటేందుకు ఇబ్బందులు తప్పవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితులు వస్తే ఎలా? ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పారుమంచాల వద్ద ఇసుకవాగుపై రూ. 5కోట్లతో ఎండీఆర్ నిధుల కింద ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో పనులను చేపట్టారు. ఈ పనులు పూర్తి అయితే పారుమంచాలకు అటువైపు ఉన్న పారుమంచాల, తూడిచర్ల, వాడాల, మద్దూరు, కనకయ్యకొట్టాల, కొత్తసిద్దేశ్వరం, వెలుగోడు వరకు వెళ్లే గ్రామాల ప్రజలకు, వాహనాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉంటుందని భావిస్తున్నారు. 50ఏళ్ల నుంచి ఇబ్బంది పడుతున్న ప్రజలకు వంతెన పనులు ప్రారంభించిన సమయంలో సంతోషపడ్డారు. అయితే వంతెన పనులు గత రెండు నెలల నుంచి ఆగిపోయాయని, పట్టించుకునే అధికారులు, ప్రజాప్రనిధులు కరవయ్యారని ప్రజలు ఆదేవన వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి వాగు వల్ల గ్రామాలకు ఉన్న సంబంధాలను, రవాణా సౌకర్యం కలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతు న్నారు. ఆర్‌అండ్‌బీ డీఈ సురేష్‌బాబును వివరణ కోరగా నిదులు, సిమెంటు కొరతతో పనులు నిలిచిపోయాయని చెప్పారు. జూలై ఆఖరు వరకు గడువు ఉందని, ఆలోపు పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

ఎన్డీయే కూటమి గెలుపు ఖాయం

డోన్(రూరల్), మే 18: రాష్ట్రంలో ఎన్డీయే కూటమి గెలుపు ఖాయమని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు గూండాల ఈశ్వరయ్య మాదిగ అన్నారు. శనివారం డోన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈశ్వరయ్య మాదిగ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి మద్దతుగా ఎమ్మార్పీఎస్ గ్రామ గ్రామాన ప్రచారం నిర్వహించిందన్నారు. రాష్ట్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రాగానే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కాగానే ఎస్సీ వర్గీకరణకు సహకరిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

వైభవంగా వాసవీ మాతా జయంతి వేడుకలు



డోన్ అమ్మవారిశాలలో వాసవి మాతకు పూజలు చేస్తున్న కోట్ల సుజాతమ్మ

డోన్(రూరల్), మే 18: పట్టణంలోని పాతపేట మెయిన్‌బజారులో ఉన్న అమ్మవారిశాలలో వాసవి మాతా జయంతి వేడుకలను ఆర్యవైశ్యులు వైభవంగా నిర్వహించారు. వాసవి మాతా జయంతిని పురస్కరించుకుని అమ్మవారిశాలలో అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు.

● పట్టణంలోని పాతపేట మెయిన్‌బజారులోని అమ్మవారిశాలలో వాసవి మాతకు జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ పాల్గొన్నారు. వాసవి మాత జయంతిని పురస్కరించుకుని అమ్మవారిశాలలో ప్రత్యేక అలంకరణలో ఏర్పాటు చేశారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం వాసవీమాత జయంతి శనివారం వేద పండితుడు పెద్దశాస్త్రీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉభయదారులచే వాసవీమాతకు క్షీరాభిషేకం చేశారు. మహిళలు సామూహికంగా 108 దీపాలు వెలిగించి అమ్మవారికి దీపోత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

బేతంచెర్ల: పట్టణంలోని ఆర్యవైశ్యుల ఇలవేల్పు కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో వెలసిన వాసవి మాత జయంతి వేడుకలు శనివారం అత్యంత వైభవంగా కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవి మహిళా మండలి సభ్యులు ఆర్యవైశ్య ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

సంజామల: మండలంలోని పేరుసోముల సంజామల గ్రామాలల్లో అమ్మవారి శాలలో కొలువుదీరిన కన్యక పరమేశ్వరి (వాసవి మాత) జయంతి వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. ఉదయాన్నే ఆర్య వైశ్య మహిళలు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు చేశారు.

రుద్రవరం : రుద్రవరం కన్యకాపరమేశ్వరి అమ్మవారికి శనివారం దాతలు మూడు కేజీల వెండితో 108 వెండి పుష్పాలను చేయించి బహూకరించారు. వెండి పుష్పాలు చేయించేందుకు దాతలు సహకరించారని ఆర్యవైశ్యసంఘం వారు తెలిపారు. వెండి పుష్పాలను అమ్మవారి జయంతి రోజున అమ్మవారికి అలంకరించారు.

●రుద్రవరం కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం వాసవీ జయంతి సందర్భంగా అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి అభిషేకం గావించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు రాచమడుగు విశ్వనాధశర్మ, శేషఫణి శర్మలు అమ్మవారికి అభిషేకం చేశారు.

బనగానపల్లె: బనగానపల్లె పట్టణంలో శనివారం వాసవీమాత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొండపేటలోని అమ్మవారిశాలో పట్టణ ఆర్యవైశ్యసంఘం, పట్టణ మహిళా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఈవేడుకలు నిర్వహించారు. మహిళలు పట్టణంలోని ఆర్యవైశ్య భవనంనుంచి 108 కలశాలతో మేళతాళాలతో బయలు దేరి కొండపేట పెద్ద అమ్మవారిశాలకు బయలు దేరి అమ్మవారి మూల విగ్రహానికి కలశాలతో జలాభిషేకం చేశారు.కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అద్యక్షుడు గాధంశెట్టి వేణుగోపాల్, శ్రీరామవెంకటసుబ్రహ్మణ్యం, బండారు లలిత తదితరులు పాల్గొన్నారు.



చాగలమర్రి కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న ఆర్యవైశ్యులు

లక్ష్మీనరసింహ స్వామికి పూజలు

రుద్రవరం, మే 18: రుద్రవరం సమీపంలోని దొర్వి, గుట్టకొండ ఆలయాలతో పాటు నరసాపురంలోని గడప లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం అర్చకులు జన్మనక్షత్ర పూజలు వేదమంత్రోచ్చరణల మధ్య ప్రారంభించారు. స్వామి అమ్మవార్లకు అభిషేకం చేశారు. తరలివచ్చిన భక్తులు స్వామి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దొర్వి క్షేత్రంలోఉన్న నరసింహుని ఆలయం ఉత్తరముఖంగా ఉంది. ఈ ఆలయంలో నరసింహస్వామితో పాటు చెంచులక్ష్మి అమ్మవారు కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు.

● మండలంలోని వాసాపురంలో వెంకటేశ్వరస్వామి లక్ష్మి గోదాదేవి అమ్మవారు మానస లింగేశ్వరస్వామి త్రిపురసుందరీదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

శిరివెళ్ల : నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలో వెలసిన సర్వ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారి మూలవిరాట్‌కు శనివారం వేకువజామునే అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన నిర్వహించారు. నారసింహుడి మూలవిరాట్‌ను పూలమాలలతో అలంకరించి శాస్త్రోక్తంగా పూజలు, మంగళ హారతి నిర్వహించారు. నంద్యాల, ఒంగోలు, గాజులపల్లె, మహానంది తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

టీబీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, మే 18: టీబీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు ఇమ్రాన్ సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఆయన మాట్లాడుతూ 2024 నాటికి టీబీ వ్యాధిని నిర్మూలించేందుకు లక్ష్యం ఉందని అన్నారు. ప్రతి గురువారం 13 సచివాలయాల పరిధిలో వయోజనులకు బీసీజీ టీకాలు వేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, వైద్య సిబ్బంది ఉన్నారు.

పాండురంగ విఠలేశ్వర బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కోవెలకుంట్ల, మే 18 : కోవెలకుంట్లలో శనివారం పాండురంగ విఠలేశ్వర బ్రహ్మోత్సవాల ఘనంగా జరిగాయి. రెండో రోజు శనివారం పేట తిరునాల కోనేటి తిరునాళ్ల, ద్వాదశ కుంభ హారతులు నిర్వహించారు.

యాగంటిపల్లెలో వీధి కుక్కల హల్‌చల్

బనగానపల్లె రూరల్, మే 18 : యాగంటిపల్లెలో శనివారం వీధి కుక్కలు హల్‌చల్ చేస్తూ పలువురిపై దాడి చేశాయి. గ్రామానికి చెందిన బాలుడు ఇతీష్‌రెడ్డి, యామ శ్రీనివాసరెడ్డితోపాటు మరో ఎనిమిది మందిపై కుక్కలు దాడి చేసి గాయపరచడంతో వారు బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రి, ప్రయివేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని కుక్కల బెడద నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

టీఎస్-ఈఏపీ సెట్ ఫలితాల్లో శ్రీసుధ విద్యార్థుల ప్రతిభ

డోన్(రూరల్), మే 18: తెలంగాణ-ఈఏపీసెట్ ఫలితాల్లో డోన్ శ్రీసుధ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. శ్రీసుధ కళాశాలకు చెందిన 7 మంది విద్యార్థులు 5వేలలోపు ర్యాంకులు సాధించారు. విద్యార్థులు బి.రంగనాథరెడ్డి 1367వ ర్యాం కు, సీఎస్‌జీ భువన కృతి 1380, ఆలా విశ్వజిద్ 1464, సి.జయసూర్య 2310, ఓ.శివ రామాంజనేయులు 2654, ఎం.వినోద్ 4553, బి.గౌతమ్ రెడ్డి 4900 ర్యాంకులు సాధించారు. విద్యార్థులకు కళాశాల యాజమాన్యం అభినందనలు తెలిపింది.



రాజోలి ఆనకట్ట ఇలా..



ఐదు అడుగుల వరకు దద్దనాల ప్రాజెక్టుకు చేరిన వరద నీరు



అవుకులో నేలవాలిన వరి పంట

దంచికొట్టిన వాన

జిల్లాలో గత మూడు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. గత మూడు నెలల నుంచి ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు ఈ వర్షాలతో ఉపశమనం పొందుతున్నారు. అలాగే రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. దుక్కులు దున్ని విత్తనాలు వేసేందుకు సిద్ధం చేసుకుంటున్నారు.



ఆర్.పాంపల్లె సమీపంలోని కుందర వాగు బ్రిడ్జి వద్ద కోతకు గురైన బీటీ రోడ్డు



వరద నీటితో జలకళ సంతరించుకున్న కుందూ



ఉయ్యాలవాడ, మే 18: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం రాత్రి 117.4 మి.మీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. బలమైన గాలులతో కూడిన వర్షం కురవటంతో చెట్లు విద్యుత్ స్తంభాలు నేలకు ఒరిగాయి. ఆర్.పాంపల్లె గ్రామ వద్ద ఉన్న కుందరవాగు బ్రిడ్జి వద్ద హరివరం వెళ్లే బీటీ రోడ్డు కోతకు గురైంది. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో నీళ్ల నిలబడి చెరువును తలపిస్తుంది.

జలదుర్గంలో భారీ వర్షం

ప్యాపిలి, మే 18: మండలంలోని జలదుర్గం గ్రామంలో శనివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. 8ఎంఎం వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగి పొర్లాయి. గ్రామ సమీపంలోని కొండ ప్రాంతంలో ఉన్న పితురు వంకకు భారీగా వర్షపు నీరు రావడంతో నడుములోతు వరకు నీరు ప్రవహించింది. బూరుగుల, సీతమ్మ తండా, నేరేడుచెర్ల, రాచెర్ల గ్రామాల్లో కూడ భారీ వర్షం కురవడంతో రోడ్లపై వర్షపు నీరు నిల్వనిలిచింది. సీతమ్మ తండాలో రోడ్లు జలమయం కావడంతో ఎక్స్ కవేటర్‌తో నీటిని తొలగించారు.

దద్దనాల ప్రాజెక్టుకు వరద నీరు

బనగానపల్లె, మే 18: బనగానపల్లె పట్టణంలోని దద్దనాల ప్రాజెక్టుకు శుక్రవారం కురిసిన వర్షానికి 5 అడుగుల వరకు నీరు చేరింది. శుక్రవారం ప్రాజెక్టు ఎగువ భాగంలో ఉన్న ఎర్రమల్ల కొండల్లో వెలసిన ఘనమద్దిలేటి స్వామి కొండల్లో భారీగా వర్షం పడడంతో వర్షం నీరు ప్రాజెక్టుకు చేరింది.

కొలిమిగుండ్ల రూరల్ : మండలంలోని గ్రామాల్లో వర్షం కురిసింది. కొలిమిగుండ్ల, మదనాంతపురం, మీర్జాపురం, చింతలాయ పల్లె , కనకాద్రి పల్లె , ఇటిక్యాల తదితర గ్రామాలలో ఓ మోస్తారు వర్షం కురవడంతో అన్నదాతలు పొలాన్ని సాగుకు సిద్ధం చేసుకోవడానికి సమయాత్తమవుతున్నారు.

నాడు వెలవెల.. నేడు జలకళ

చాగలమర్రి, మే 18: మండలంలోని రాజోలి ఆనకట్ట వరద నీటితో శనివారం జలకళ సంతరించుకుంది. రెండు నెలల నుంచి నీరు లేక ఒట్టిపోయింది. నీటి కోసం మూగ జీవాలు, రైతులు, కూలీలు ఇబ్బందులు పడ్డారు. వరుణుడు కరుణించడంతో ఎగువన కురిసిన వర్షంతో వరద నీరు ఆనకట్టకు చేరుకుంది. 1,000 క్యూసెక్కుల నీరు ఆనకట్ట వద్ద నిండు కుండలా ఉంది. కుందూ నది నుంచి ఆనకట్ట వద్ద రెండు అడుగుల నీరు నిల్వ ఉన్నట్లు కేసీకెనాల్ ఏఈ జమాల్‌వలి తెలిపారు. ఎగువ నుంచి వరద నీరు అధికంగా వస్తే ఆనకట్ట వద్ద కుందూ పొంగి ప్రవహిస్తుందన్నారు.

● మండలంలో శనివారం తెల్లవారుజామున కురిసిన కుండపోత వర్షంతో వాగులు, వక్కిలేరు పొంగి ప్రవహించాయి. కలుగొట్లపల్లె, బ్రాహ్మణపల్లె వక్కిలేరు వంతెనలపై వరద నీరు పొంగి ప్రవహించింది.

సంజామల: మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి భారీవర్షం కురిసింది. 48.6 మిల్లీమీటర్లు వర్షపాతంగా నమోదైయింది.

అవుకులో 27.2 మిల్లీ మీటర్ల వర్షపాతం

అవుకు, మే 18 : మండలంలో శుక్రవారం అర్ధరాత్రి 27.2 మిల్లీలీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. వర్షం పడడంతో చాలా చోట్ల వరిపంట నేల వాలింది. ఎకరాకు రూ.30వేలు ఖర్చు చేశామని, దీంతో తీవ్రంగా నష్టపోయినట్లు రైతులు వాపోతున్నారు. కొన్ని చోట్లపంట నూర్పిడి చేసి కళ్ళాలు, రోడ్డుపక్కన నిల్వ చేసుకున్నారు. ధాన్యంపై టార్పాలిన్ పట్టలు కప్పి వర్షం బారినుంచి కాపాడుకుంటున్నారు.



వర్షానికి తడవకుండా అవుకులో వరి ధాన్యంపై కప్పిన టార్పాలిన్ పట్టలు



జలదుర్గంలో భారీగా ప్రవహిస్తున్న వర్షపు నీరు



తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు కోనేటి రమేష్

24న ఆలయ భూములకు వేలం పాట

చాగలమర్రి, మే 18: చాగలమర్రి గ్రామంలోని రామలింగేశ్వర, లక్ష్మీ చెన్నకేశవ ఆలయాలకు సంబంధించిన భూములకు ఈనెల 24న కౌలుకు ఇచ్చుటకు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు దేవదాయశాఖ ఈవో సాయి జయచంద్రారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ చెన్నకేశవ ఆలయంలో వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. రామలింగేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన 34.66 ఎకరాల భూములకు, లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయానికి సంబంధించిన 15.51 ఎకరాల భూములను కౌలుకు ఇవ్వడానికి వేలం పాటలు నిర్వహిస్తున్నామని అన్నారు. పాటదారులు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు. 2024 నుంచి 2027 వరకు కౌలు హక్కు కల్పించనున్నట్లు చెప్పారు.

ఆలయ భూముల కౌలు వేలం : ఈవో

శిరివెళ్ల, మే 18 : మండలంలోని కోటపాడు గ్రూపు దేవాలయాల పరిధిలోని వివిధ ఆలయాలకు చెందిన భూములకు బహిరంగ కౌలు వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి గంటా వేణునాథ రెడ్డి శనివారం తెలిపారు. చెన్నూరు గ్రామంలో వెలసిన వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన 20.42 ఎకరాల భూములకు ఈ నెల 27వ తేదీ సాయంత్రం 4 గంటలకు బహిరంగ కౌలు వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు. అదేరోజు సాయంత్రం 5 గంటలకు శిరివెళ్లలోని ఓంకారేశ్వర స్వామి ఆలయానికి చెందిన 51.30 ఎకరాల భూములకు కౌలు వేలం నిర్వహిస్తున్నామన్నారు. బోయలకుంట్ల గ్రామంలోని వివిధ ఆలయాలకు చెందిన 66.15 ఎకరాల భూములకు ఈ నెల 29వ తేదీ ఉదయం 10.30 గంటలకు బహిరంగ కౌలు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో రామేశ్వర, వీరభద్ర స్వామి ఆలయానికి చెందిన 25.26 ఎకరాలకు, అనంత పద్మనాభ స్వామి దేవస్థానానికి చెందిన 11.62 ఎకరాలకు, ఆంజనేయ స్వామి ఆలయానికి చెందిన 11.44 ఎకరాలకు, వేణుగోపాల స్వామి ఆలయానికి చెందిన 11.89 ఎకరాలకు, నరసింహ స్వామి దేవాలయానికి చెందిన 5.94 ఎకరాలకు వేలంపాట నిర్వహిస్తున్నామన్నారు. కౌలువేలం పాల్గొనదలచిన వారు రూ.5 వేలు డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుందన్నారు. అదే రోజు సాయంత్రం కామినేనిపల్లె గ్రామంలో వెలసిన ఈశ్వర స్వామికి చెందిన 18.09 ఎకరాలకు, ఆంజనేయ స్వామికి చెందిన 12.97 ఎకరాలకు కౌలువేలం నిర్వహిస్తున్నట్లు ఈవో వేణునాథరెడ్డి వెల్లడించారు. 2024-25 సంవత్సరానికి గాను ఏడాది కాల పరిమితితో ఈ వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు ఈవో వేణునాథరెడ్డి తెలిపారు.

రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

చాగలమర్రి, మే 18: మండలంలోని మల్లేవేముల గ్రామ సమీపంలో కుందూతీరం వద్ద వెలసిన చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా 25న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి శనివారం తెలిపారు. దాతల సహకారంతో బండలాగుడు పోటీలు ఏర్పాటు చేశామని అన్నారు. ఈ పోటీలో గెలుపొందిన వృషభరాజములకు మొదటి బహుమతి రూ.1.10 లక్షలు, రెండో బహుమతి రూ.75 వేలు, మూడో బహుమతి రూ.50 వేలు, నాల్గో బహుమతి రూ.30 వేలు, ఐదో బహుమతి రూ.20 వేలు, ఆరో బహుమతి రూ.10 వేలు ప్రోత్సాహక బహుమతులు అందజేయబడతాయని అన్నారు.

'పంపిణీకి సిద్ధంగా జీలుగ విత్తనాలు'

నంద్యాల, మే 18(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మండలంలోని రైతులకు 50 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఏవో కిశోర్‌కుమార్‌రెడ్డి శనివారం చెప్పారు. మండలానికి 300 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. క్వింటా ధర రూ.8,800 కాగా 50 శాతం సబ్సిడీ పోతే రూ.4,400 రైతులు చెల్లించాలని చెప్పారు. రైతుకు ఎకరాకు 10కేజీలు మొదలుకొని గరిష్ఠంగా 5 ఎకరాలకు 50 కేజీలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, పాసుపుస్తకం జిరాక్స్ కాపీలతో స్థానిక ఆర్బీకేలకు వెళ్లి తమ పేర్లను నమోదు చేసుకొని, కావాల్సిన జీలుగ విత్తనాలకు కోసం ముందుగా డబ్బులు చెల్లించాలని ఆయన చెప్పారు.

చాగలమర్రి, మే 18: మండలంలోనిఆయా గ్రామాల రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు ఏవో రంగసేతాజీ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 150 క్వింటాళ్ల జీలుగలు మంజూరయ్యాయని అన్నారు. జీలుగ విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్‌బీకే కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

వచ్చేది టీడీపీ ప్రభుత్వమే

● బీసీ జనార్దన్ రెడ్డి, ధర్మవరం సుబ్బారెడ్డి



పోలూరు వెంకటేశ్వర్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీసీ జనార్దన్ రెడ్డి, ధర్మవరం సుబ్బారెడ్డి

బేతంచెర్ల, మే 18: అధికారంలోకి వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోలూరు వెంకటేశ్వరరెడ్డి కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వహక ప్రధాన కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం పోలూరు వెంకటేశ్వరరెడ్డి కుటుంబాన్ని వారు పరామర్శించారు. వారు మాట్లాడుతూ టీడీపీ బలోపేతానికి పోలూరు వెంకటేశ్వరరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, సీనియర్ నాయకులు పోలూరు రాఘవరావు, పోలూరు శ్రీనివాసరెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి, సమన్వయ చైర్మన్ చంద్రశేఖర్, సుధాకర్, డోన్ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మురళి కృష్ణ, తిరుమలేష్ చౌదరి, జావాజి వెంకటేశ్వర్లు, జాకీరుల్లాబేగ్, మేకల నాగరాజు, రూబెన్, వార్డు కౌన్సిలర్ రామగోపాల్, రామ్మూర్తి, నంద్యాల మధు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం

బేతంచెర్ల, మే 18: మండలంలోని రుద్రవరం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మంటి రామాంజనేయులు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. చికిత్స నిమిత్తం గ్రామ టీడీపీ నాయకులు సురేష్, వీరాంజనేయులు రూ.5వేలు ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు హరి, బజారు, వెంకటరాముడు, మద్దిలేటి, గిరి కృష్ణుడు తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం

మండలంలోని సిమెంటునగర్ గ్రామానికి చెందిన పాస్టర్ డేవిడ్ బ్లెస్సింగ్టన్ వైద్య చికిత్సల నిమిత్తం బేతంచెర్ల పాస్టర్ల అసోసియేషన్ పాస్టర్లు ఆర్థిక సాయం శనివారం అందజేశారు. సిమెంటునగర్ గ్రామంలోని చర్చిలో పాస్టర్‌గా పని చేస్తున్న డేవిడ్ బ్లెస్సింగ్టన్‌కు ఓపెన్ హార్ట్ సర్జరీ పాస్టర్ కుటుంబానికి ఆర్థిక సాయం రూ.16,300 అందజేసినట్లు అసోసియేషన్ సెక్రటరీ డీవీఎస్ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంటు సామేలు, పాస్టర్లు ఆనంద్, జయరాజు, సురేంద్ర, మల్లేష్ బాబు, హేంద్రీబాబు పాల్గొన్నారు.

యాగంటిలో భక్తుల సందడి

బనగానపల్లె, మే 18: బనగానపల్లె మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన యాగంటిలో శనివారం భక్తుల సందడి నెలకొంది. గత రెండు రోజుల నుంచి భక్తులు యాగంటి క్షేత్రానికి వేలాదిగా వస్తున్నారు. భక్తులు క్యూలైన్ల ద్వారా ఉమామహేశ్వరస్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు వెంకటేశ్వరగవిని దర్శించుకొని వెంకటేశ్వర స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.



క్యూలైన్‌లో భక్తులు

పింఛన్ అందజేయండి

సంజామల, మే 18 : 20 రోజులైనా పింఛన్‌దారులకు పింఛన్ అందలేదని పింఛన్‌దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 1200 మంది పింఛన్‌దారులు ఉన్నారు. పింఛన్ కోసం రోజు బ్యాంకులు, సచివాలయాల చుట్టూ తిరుగుతున్నామని వాపోయారు. మండల వ్యాప్తంగా వృద్ధ, వికలాంగులు, ఒంటరి, వితంతుమహిళలు 5,300 పింఛన్లు ఉన్నాయి. వారిలో దాదాపు 1200 మందికి నేటికి వరకు పింఛన్‌లు వారి ఖాతాల్లోకి జమ కాలేదు. అధికారులు స్పందించి పింఛన్లు త్వరగా బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని పింఛన్‌దారులు కోరుతున్నారు.

అధ్వానంగా ముదిగేడు రహదారి



అధ్వానంగా ఉన్న రహదారి

సంజామల, మే 18 : సంజామల నుంచి ముదిగేడుకు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. రోడ్డుకు కంకర వేశారు.. కాని తారు వేయడం మార్చారని ప్రజలు ఆరోస్తున్నారు. ఈ రహదారిని డబుల్ రోడ్డు వేయిస్తామని అప్పటి పాలకులు,అధికారులు గుంతలు పడ్డ ప్రాంతంలో తవ్వేసి వదిలేశారు. గత ఏడాది ఆర్థికమంత్రి బుగ్గన సంజామల పర్యటన పుణ్యామా అంటూ గుంతలు పొడ్డ ప్రాంతంలో కంకర మిక్సర్‌తో చదును చేయించారు. అయితే వర్షాలకు కంకర మిక్సర్ కొట్టుకుపోయి రహదారిపై కంకర తేలియాడుతుంది. సంజామల నుంచి వెళ్లాలన్న అవుకుకు వెళ్లాలన్న ఈ రహదారిపై ప్రయాణం ప్రయాణికులకు భయాందోళన చెందుతున్నారు. ఆర్ అండ్ బీ అధికారులు రహదారిపై తారు పోయించాలని ప్రజలు కోరుతున్నారు.

మెరుగైన వైద్యం అందించండి : బీసీ



వైద్యులతో మాట్లాడుతున్న బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె రూరల్, మే 18 : అతిసార బారిన పడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి వైద్యులను కోరారు. మండలంలోని రామతీర్థం గ్రామంలో కలుషిత తాగు నీరు తాగి 30 మందికి పైగా అతిసార బారిన పడ్డారు. గ్రామానికి చెందిన కొత్తపల్లె నాగరాజు, ఎ.దానమయ్య, ప్రసాదు, ఇమ్మానియేలు, ఏసేబు, మరియమ్మ దంపతులు, ప్రసాద్, కాశీంతోపాటు మరికొంత మంది గ్రామస్తులు వాంతులు, విరేచనాలతో బాధపడుతూ నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి శనివారం ఉదయం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి అతిసార బాధితులను పరామర్శించారు. స్థానిక వైద్యులను అడిగి ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. బాధితులందరికీ మెరుగైన వైద్య సేవలు అందించి త్వరగా కోలుకునేలా చూడాలని కోరారు. గ్రామంలో అతిసార ప్రబలడానికి గల కారణాలపై బీసీ ఆరా తీశారు. మాజీ ఎమ్మెల్యే బీసీ వెంట రామతీర్థం టీడీపీ నాయకులు మద్దిలేటి, శివుడు, సురేష్, ప్రతాప్, కిట్టు ఉన్నారు.